కథానిక:

తెగిన గాలిపటం

శ్రీ బలివాడ కాంతారావు

చలమయ్య మేష్టారి అల్లుడు రైలుక్రింద తలపెట్టాడు—ఈ వార్త ఊరంతా ప్రాకిపోయింది. చాలమంది నోటివెంబడి "మేష్టారి కూతురు సుఖపడిందిలే" అన్న మాటలు వచ్చినయ్.

అల్లుని శవం చూచిన మేష్టారు చలించలేదు. సావిత్రి ఆ సమయంలో వూర్లో లేదు. ఆమె వచ్చేసరికి తండ్రి పరిస్థితియేమీ బాగులేదు.

ఊర్లో చిన్నా పెద్దా మేష్టారి ఇంటిచుట్టూ మూగారు. అల్లుడు చనిపోయాడని పలుకరించడానికి కాదు—ఇంత జ్ఞాని—ఇలా అయిపోయారేమని ఓదార్చడానికి!

మనిషోలా అనుకున్నారు. "వాడు బ్రతికి ఆ కూతుర్ని యేం సుఖపెట్టాడు. తననేం హాయిగా బ్రతకనిచ్చాడు? ఆ చచ్చిన వాడైనా యేం సుఖపడ్డాడు?"

"అలుడు చచ్చాడంటే మేష్టారు పీడాపాయిందన్నారే—గుండెనిబ్బరం లేనివాళ్ళమీద—చేతకాక పౌరుషం హెచ్చయి రైలుక్రింద తలపెట్టినవాళ్లమీద చలమయ్యమేష్టారు సానుభూతి చూపించారే! అలాంటిది సాయంత్రంసరికి మతి తప్పినవారిలా అయారేం?"

"అసలు—ఆ సావిత్రికి లేని దుఃఖం ఈయనకెందుకూ అని?"

వచ్చేవారు చెప్పినవిధంగా చెప్తున్నారు. ఎప్పుడూ కన్నీరు చూడనివాళ్లు మేష్టారి కంటివెంబడి నీరు కారటంతో చాలామంది కళ్లనులుపుకొని వెళ్ళిపోతున్నారు!

"మీరే చావుబ్రతుకులుగురించి యెంత చెప్పేవారు?—అలాంటిది ఈ సమయంలో గుండెధైర్యం లేకుండావుంటే ఆ అమ్మాయి యెలావుంటుంది?" — సలహా చెప్పేవాళ్లు చెప్తున్నారు!

మేష్టారు అందరి సలహాలు వింటూ వింటూనే కళ్ల వెంబడి నీరు బొటబొటా కారిపోతోంది. రెండు రోజులైంది నిద్రాహారాలు లేవు. ఎవరితోనూ చివరికి కూతురుతోనైనా మాటాడలేదు. కారణం? ఏ ఒక్కరికీ యీ ప్రశ్నకి జవాబు దొరకలేదు.

* * *

చలమయ్యమేష్టారి పుట్టుక పెరగటం వుద్యోగం బొబ్బిలిలోనే. బొబ్బిలి హైస్కూల్లో తెలుగు పండితులు. స్వయంకృషివలన బయటికివచ్చి వూర్లో అందరిచే గౌరవింపబడుచున్నారు. ఆ గౌరవం సర్వకాలాల్లోనూ చెక్కు చెదరకుండా నిలబెట్టుకొనేటట్లు మెసలుతూ వచ్చారు.

మేష్టారికి ముప్పయ్యేళ్ల ప్రాయంలో భార్య గతించింది. అప్పటికి ఒకే ఒక సంతానం సావిత్రి—ఆరేళ్ళపిల్ల. ఆయనమీదనున్న అభిమానంతో వూర్లోవారందరూ డబ్బు సహాయం చేస్తామని మళ్లీ పెళ్ళి చేసుకోమన్నారు. అందుకు ఆయన అంగీకరించక ఆ కూతురును చూసుకొనే పవిత్రంగా బ్రతికారు. సావిత్రి ఏపుగా అందంగా పెరుగుతూ ఆ వయసులో సాధారణంగా చూపించని తెలివితేటలు చూపించటంలో మేష్టారు యెంతో మురిసిపోయేవారు. పెళ్ళీడు వచ్చింది. తల్లిపోయాక తనే తల్లీ అయ్యా క్షేమం తన చేతులతో యింత చేసాక యింకోయింటికి పంపించడానికి యెంత ప్రయత్నించినా మమకారాన్ని చంపుకోలేకపోయారు. "ఆడపిల్లకు అత్తవారిల్లు శాశ్వతం కానీ, నాకెవరున్నారు? అమ్మాయి వెళిపోతే నేను ఇంట్లో వుండగలనా? అమ్మాయిని విడిచి బ్రతుకలేనని" ఒకసారి, మళ్ళీ యింకొకసారి "నా పిచ్చిగానీ! ఆడపిల్లకి పెండ్లి శోభస్కరంకదా—పెళ్లి చేస్తే అమ్మాయిమాత్రం మొగుడ్ని విడిచి ఉండగలదా నాయనా? ఉంటే నెలా రెండునెలలూ—నాతల్లి నా కంటికి కనపడాలన్న స్వార్థంతో వాళ్ల సుఖం చంపడం నాకు భావ్యమా? అన్నిటికీ దొడ్డవాడొకడున్నాడు. ఈ నాటకంలో మన పాత్ర ఎంత వుత్తమంగా నిర్వహించామని అనుకోవటమేగానీ—ఏమిటో మనిషి అంతా స్వంతం అనుకొని బ్రతకటంకన్న తెలివితక్కువ ఇంకొకటి లేదు."

ఈ మాటలు తన శిష్యుల్లో ఒకడైన రామారావుతో ఆరోజుల్లో చెప్తూవున్నారు. రామారావు తండ్రి పల్లెనుంచి తెచ్చి మేష్టారికి పదేళ్ల కుర్రాడ్ని అప్పచెప్పారు. మేష్టారి అడుగుజాడల్లో పెరుగుతూ పెద్దవాడై ప్రస్తుతం రామారావు ఆంధ్రా యూనివర్సిటీలో చదువుకుంటున్నాడు.

ఇలా బాధపడుతూనే సంబంధాలు చూసేవారు. తన మనసులో కోరికే ఫలించింది.

సావిత్రి పెళ్ళి ఒకానొక మంచి ముహూర్తాన అయిపోయింది. మేష్టారి సంతోషం పట్టలేనంతదైపోయి కన్నీరు కారింది. ఆనందరావు నిజంగా ఆనందరావే. ఆయన యేవిషయమైనా చాలా తేలికగా తీసుకుంటాడని యెల్లప్పుడు సరదాగా ఉండే మనిషని చాలామంది అనుకున్నారు. మనిషి అందగాడనే చెప్పాలి. మాటలు తీరు చాలా ఆర్భాటం అనిపించినా మర్యాదగల మనిషిగానే కనిపించాడు.

సావిత్రి అందమైన మొగుడ్ని అందులో ఇల్లరికం వచ్చిన మొగుడ్ని కట్టుకొని సుఖిస్తుందని అందరూ అనుకున్నారు. మేష్టారు యీ అల్లుడ్ని యెలా కలుసుకున్నదీ రామారావుతో చెప్పారు. పాలూరు ఒక స్నేహితుని ఇంటికి వెళ్లారట. ఆయన [illegible]

డిమాన్‌స్ట్రేటరు. ఆరోజునే బదిలీమీద వచ్చిన ఆనందరావు చాలాకీ చూసే ముచ్చటపడి నాలుగు విషయాలు కనుక్కొని ఎగ్రికల్చర్ మేస్త్రీ ఐతేనేం? బొబ్బిలి బదిలీ చెయ్యిస్తానని తన స్నేహితుడు హామీ ఇచ్చాడు—ఇంట్లో ఉండటానికి ఒప్పుకున్నాడు—ముందు వెనుకా యెవరూ లేరు. భగవంతుడు ఈనాటికి అనుగ్రహించాడని పెండ్లి నిశ్చయంచేసారుట.

ఎవరూలేరా? ప్రశ్నించాడు. రామారావు కడుపులో ఉన్నప్పుడే తండ్రిపోయాడట! తల్లి రెండేళ్ళక్రితం పోయిందట! చాలాడబ్బు సంపాదించే పోయాడట! కూర్చొని తింటే కొండలు తరిగిపోవా నాయనా? ఆస్తిపాస్తులు లేకపోయినా ఏదో వుద్యోగం చేసుకుంటున్నాడు. కుటుంబాన్ని పోషించుకోలేడా? అన్నారు.

బొబ్బిలి అల్లుడ్ని వెంటనే బదిలీ చేయించుకున్నారు. తొలిసారి మేష్టారు అల్లుడితో చెప్పవలసిన పరిస్థితి ఎప్పుడు వచ్చిందంటే— ఆయన కళ్ళతో అల్లుడు ఒకనాడు ఊరుబయట ఎవరో భామతో సరససల్లాపాలు ఆడటం చూసాక!

ఆనందరావు నిజస్వరూపం చాలా వేగిరంగానే బయట పడిపోయింది. తను తెచ్చుకున్నది ఇప్పుడు తన ఖర్చులకే చాలదు. మేష్టారు అడగకుండా వుండలేకపోయారు. మొదట మౌనం వహించిన తరువాత "ఇల్లరికం నిన్ను పోషించడానికి వచ్చాననుకున్నావా? నన్ను నువ్వు పోషించా"లన్నాడు. ఇలాంటి కటువుమాటలు ఇదివరకు వినని మేష్టారు ఒకరోజంతా భోజనం చెయ్యలేకపోయారు. ఒకనాడు మొగుడూపెళ్లాల కేం వచ్చిందో మేష్టారు చూస్తుండగానే చెప్పుతీసి సావిత్రిని కొట్టే పళ్ళలోనుంచి రక్తం కారటం మేష్టారు చూసి అక్కడినుంచి వెళ్లిపోయి రాత్రి తొమ్మిది దాటకగానీ యింటికిరాలేదు. మళ్లా అల్లునితో యిది నాయనా అది నాయనా అంటూ యీ విషయం ఆ విషయం మాట్లాడేవారు. కానీ వాడు వినిపించుకొనేవాడు కాదు—వినిపించుకున్నా చివరికి ఈ వెట్టి వేదాంతాలన్నీ నాకెందుకూ? అని అక్కడనించి వెళ్లిపోయేవాడు.

క్రొత్తగా ఒక ఆఫీసరు వచ్చాడు. ఎక్కడికో వెళ్ళమన్నాడట-నే వెళ్లనన్నాడట-అది మనసులో పెట్టుకొని ఒకనాడు సంచితో రికార్డు మోసుకొని వెళ్ళమంటే యేదో గలాభా జరిగింది. తను చేస్తున్న ఉద్యోగం చిన్నదైనా తన వ్యక్తిత్వానికి తగ్గ పని చెప్పుతున్నాడు. ఒక వారంరోజుల్లోనే కలహం పెరిగిపోయింది. మాటామాటా వచ్చి ఆ ఆఫీసర్ని చెంపపెట్టు తగిలించడానికి వురికితే గుమస్తా అడ్డుపడ్డాడు. మేష్టారి ముఖంచూసి ఉద్యోగం తీసేసేబదులు యేజన్సీప్రాంతాలకి బదిలీచేయించాడు. రెండు రోజులు వూరుకొని యేంనాయనా యిలా చేసావని మేష్టారు అల్లుడ్ని అడిగితే కోపంగా "నన్ను యీ గులాంని చేస్తే నేను మీయింట్లో ఉంటానా? నీ ఆసరాచూసుకొని నీ కూతురు నన్ను మొగుడిలా చూడటంలేదే! బదిలీ చేయించుకోడానికే వాడికి గట్టిగా తగిలించబోయాను—ఇప్పుడు నీ కూతురు నాతో రాదూ?"

మేష్టారు "పోనీ యీ వూళ్లోనే వేరేగా వుండలేకపోయావా నాయనా? అమ్మాయి నువ్వూ కంటికి కనిపించేవారు."

నవ్వేసి "పిచ్చి—ఎందుకొచ్చిన మమకారాలు హాయిగా బ్రతకడం మీరిద్దరూ నేర్చుకోలేదు"—అన్నాడు.

మేష్టారు కూతుర్ని చూసి నాలుక కదలనిచ్చేవారుకారు. తనకెటువంటి గౌరవం వుండకపోయినా అల్లుడనే మమకారం చంపుకలేనిది. అది చంపుకోవాలని ప్రయత్నించినా కూతురు బ్రతుకేమవుతుందనే భయంచేత చాలా నెమ్మదిగా వుండేవారు.

ఒకనాడు యెంతో ఆప్యాయంగా "అంత కేంవుంది—కొన్నాళ్లు యిక్కడేవుండు నాయనా" అంటే వెంటనే తన పెళ్లాన్ని పంపించితీరాలని పెట్టె పరుపూ సర్దడం మొదలు పెట్టాడు. మేష్టారు చివరికి "నీక్కావలసింది అంతేగా. నేనెవర్ని పంపించకపోడానికి? నీ పెళ్లాన్ని నువ్వు తీసుకపో నాయనా!"

ఆ మాట అన్నారు. తన కళ్ళల్లో నీరు నింపకూడదనుకున్నారు. ఇంటినుంచి కదులుతున్న కూతురు మౌనంగా మమకారాన్నంతా కన్నీరుగా వలకబోస్తుంటే నాలుగడుగులైనా ముందుకు పడలేదు.

గదిలో కూలబడిన మేష్టారు తనకు తెలిసినంతమట్టుకు తొలిసారిగ విలపించారు. భార్య పోయినప్పుడైనా యిలా కాలేదు. పెళ్లాం తనను ఏదేదో ప్రశ్నించినట్లు తనుకూడ ఆమెకు దరిదాపుల్లో చేరినట్లు భ్రమించుతూ పెల్లుబికిన దుఃఖముతో తనలో తనే పిచ్చివానిలా మాటాడుకున్నారు. "నా సావిత్రమ్మకు సత్యవంతుడ్ని తెస్తాననుకున్నాను—తెచ్చాననుకున్నాను. కానీ...కానీ......"

ఎంతోసేపటికిగానీ యీ చీకటిపోయి తెలతెలవారే ఉషఃకాంతులు మనసులోనికి అలుముకోలేదు. కుదుటపడిన మనసు ఏకాంతంనుంచి బయటపడడానికి ఆలోచించింది. ప్రకృతి వుదయించిన దగ్గరనుంచి పడిన కోట్లకొలది వానజల్లులలోని ఒక బిందువు తను? ఎండిపోయిన ఇసుకపైబడితే లాభం ఏముంది? ఒక చెరువులోనో ఒక బీటలుదేరిన పొలములోనో—లేక సుక్తిలోనో... పడితే ఈ జన్మ తరిస్తుంది. ఈ తలపులు తనమీదనే జాలిని పుట్టించాయి. చిన్ననవ్వు నవ్వి "యేమిటో ఈ సంబంధాలు ఎందుకో ఈ అభిమానాలు. తెలివితక్కువచేత మా అల్లుడ్ని దూషిస్తున్నాగాని వాడు నాలాంటి మనిషే కాని దుర్బలుడు; అలాంటివానిమీద కోపం అసహ్యం చూపించి చేలవుతానా? మా అమ్మాయిమీది అభిమానం యీనాడు లేకపోతే రేపైనా నాతల్లి మంచితనముచూచి కలగదా?"

సావిత్రి జీవితం పోలకొండలో మరీ దుర్భరమైంది. ఎన్ని హింసలుపెట్టినా మౌనంతోనే భరిస్తూ తను తండ్రికి ఒక వుత్తరమైనా వ్రాయడానికి వీలులేదన్న భర్త ఆజ్ఞ అక్షరాలా మనస్ఫూర్తిగా పాటిస్తోంది. తండ్రి ఉత్తరాలమీద ఉత్తరాలు వ్రాస్తున్నా ఏదీ భార్యకు చూపించకుండా అడపాదడపా జవాబులిస్తున్నాడు.

ఒకనాటిరాత్రి ఆనందరావు ఎవరిదగ్గరనుంచో పుస్తకం తెచ్చాడు. కథలో రచయిత ప్రతీ ఆడదానికీ ఇంకో మగాడిమీద వుంటుందిగానీ సంఘంలో కట్టుబాట్లకి జడిసి ఆ కోరికను మనసులోనే వుంచుకుంటుందని వ్రాశాడు. అది చదివి పెళ్లాన్ని బలవంతంచేశాడు నీకింకేమగాడిమీద వుందో చెప్పమని. చాల సేపటి వరకు ఆమె ఊరుకుంది. కాని ఏదో అంటేనేగాని తను అక్కడ వుండలేని పరిస్థితి వచ్చి నాకెవరిమీదా లేదంది.

లేనామీదలేదని నాకు తెలుసు. ఆ సంగతి ముందుగానే ఆమెతో చెప్పు"మన్నాడు.

సావిత్రి ఒక కొంపపెట్టు పడేవరకు నలించలేదు. రేపొద్దు బయలు నవ్వింది. ఆ నవ్వుమాసి గది బయటకు తోసేస్తుంటే ఇంటా విడ కలుగజేసుకుంది. వాళ్ళతో కయ్యానికి దిగగానే ఆమె ఊరుకుంది. పైన దోమలు చలి ఆ చీరకొంగు కప్పుకొని తెల్లవారేవరకు అలానే కూర్చుంది. ఉదయం తలుపు తెరచేసరికి సావిత్రి మామయ్యలుగా గదిలోనికి వెళ్ళబోతుంటే "నా అసలైన పెళ్ళాం అయ్యుంటే నా మనసు అర్థంచేసుకోనేయుందువు. నన్ను తలుపుతీయమని ప్రతిమాలేదానవు. నీమనసు ఇంకెవరిమీదో లగ్నం అయివుంటుంది. అందుచేతనే ఇంట్లో ముంకులావుంటావు."

ఈ మాటలన్నీ నలుగురికీ వినపడాలి—తను చేసిన పనులు నలుగురికి తెలియాలని ఆనందరావుకు ఉబలాటం హెచ్చు. సావిత్రికి అంతా గుట్టే.

మాష్టారుకు వరసగా రెండురోజులు అమ్మాయి కలలో కనబడింది. ఒకరోజు విచారంగా ఉన్నట్లు మరుచటిరోజు నన్ను మరచిపోనాన్నా అని ఏడుస్తున్నట్లూ—ఏదో జరిగివుంటుందని నిల్చున్నపాటున బయలుదేరేముందు అల్లుడువ్రాసిన ఉత్తరం అందింది.

"మీ అమ్మాయి నాకు మీ పేరుపెట్టి భయపెట్టాలని చూస్తోంది. పీకపట్టుకొని నూతివరకు త్రోసుకవెళ్ళి పడ్తావా లేదా అని అన్నానేగాని మళ్ళీ భార్య అని ఇంటికి తీసుకవచ్చి ఆమె చేతితోనే ఆమె మెడకే రిబ్బను కట్టించాను. ఎందుకు? నన్ను ఎదిరించినవాళ్ళకు ఉరిశిక్ష విధించి న్యాయం చేకూర్చాలి."

మేష్టారి కాళ్లు విరిగిపోయినా పరుగెత్తుకవెళ్ళినట్లు పాలకొండ వెళ్లారు. కూతుర్ని ప్రాణంతో చూడగానే సగం పోయినప్రాణం తిరిగివచ్చింది. తల నిమురుతూనే వచ్చేదుఃఖాన్ని ఆపుకుంటూ "నాతల్లీ...నాతల్లీ...ఇంక నోరు పెగలలేదు. కూతురు కాసేపటికి చిరునవ్వుతో "నాకేంనాన్నా హాయిగానే ఉన్నాను."

భార్యమాటలకు ఆనందరావు వెక్కిరించాడు. "సంతోషంగా వుండటం సత్యం ఆడటం మీ అమ్మాయికి తెలియద"న్నాడు. అంతేకాకుండా తన ప్రతాపం మామగారికి బాహాటంగా తెలియపర్చాడు. మనసులో తన కూతురు ఇంత బాధ ఏలా ఓర్చిందని గింజుకున్నా పైకి ఏమీ అనలేదు. ఆశ్చర్యం ఏమంటే ఆనందరావు ఒక నెలరోజులుపాటు చిక్కిపోయిన పెళ్లాన్ని కన్నవారింటికి పంపడానికి ఒప్పుకున్నాడు.

సావిత్రికి కన్నవారింటికి వెళ్లడం ఇష్టం లేకపోయినా తండ్రి బలవంతానికిలోడు భర్తకూడా మంచిమాటలు ఆడటం మొదలు పెట్టాడు. ఈలోగా తనేవచ్చి మళ్లీ తీసుకవెళ్తానన్నాడు.

అనుకున్నట్లు ఆనందరావు నెలరోజుల్లోగానే బొబ్బిలివచ్చాడు. ఈసారి తిరిగి వెళ్లే అవసరం లేకపోయింది. ఇంటి పొరుగునే యున్న ఓ క్రొత్తకోడలితో సరసం భోజనం చెయ్యబోయాడు. ఫలితం ఆ వూర్లోనేకాదు చుట్టుపట్ల ఎక్కడా నిలవటానికి వీలులేకపోయింది. ఆ అమ్మాయి రక్షైత్రు నోరమూస్తేలు జూసేదని అంచేత తను యిలా చేయబోయానని అనగానే పిప్రకూడా చదువైంది.

వచ్చిన నాలుగురోజులు ఏగొడవాలేదు. ఒళ్లు గట్టిపడ్డాక సావిత్రివైపు ఒకనాటిరాత్రి చూస్తూ చూస్తూ "నువ్వు చాలా మంచి దానవు" అన్నాడు. ఆమె ఒకసారి తలెత్తి చూసింది. కార్బైన్ లాంతరు వెలుగులో ఆమె ఇన్నాళ్లు మనసులో వూహించుకున్న మొగుడు కనిపించాడు. "నువ్వనుకుంటే ఉద్యోగం ఊడేదికాదు. దెబ్బలు తినేవాడ్నికాదు—"

"ఛా" అంది ఆశ్చర్యంగా సావిత్రి.

"నాకు అబద్ధం ఆడటం తెలియదు. నిన్ను ఎందుకు వంచించాననుకున్నావు..."

మౌనం సావిత్రిని కొంతసేపు మ్రింగివేసింది. ఈసారి పెగిలిన గొంతుకలో ఆవేదనా విచారం మిళితమై "నా బ్రతుకు నేను వేరేగా బ్రతుకుతున్నాననే ఆశైనా లేకుండాచేశారు."

"మీ నాన్న కోరిక నీకోరిక నెరవేరిందిగా! మళ్ళీ ఇల్లరికం వచ్చాను."

"నాకాకోరిక ఎప్పుడూ లేదు."

జవాబులేదు. ఆ మరుచటిరోజు ప్రశాంతంగానే గడిచింది. నిజం మేష్టారుతోను చెప్పాడు. ఆయన విచారించలేదు. మనసు కుదుటపడితే చిన్న వుద్యోగం సంపాదించవచ్చుని.

ఇక ఊరువెంబడి పడ్డాడు. పదిహేనురోజుల్లో చాలా గొడవలు జరిగాయి. ఒక గొడవ చాలా తీవ్రరూపందాల్చింది. తను ఒక ప్రముఖ సోషలిస్టుని అవినీతిని పూర్తిగా యెదుర్కొనే వీరుడని సంఘసేవే తన జీవితలక్ష్యమని నలుగురితో చెప్పటం మొదలు పెట్టాడు. అవినీతిని బయటపెట్టే కార్యక్రమంలో మొదటిమెట్టుగా గోడమీద కాగితములు అంటించడం మొదలుపెట్టాడు. ఎవడో ఏదో చేస్తున్నాడని—ఇంకో ప్రముఖవర్తకుడు ఫలానా ఆఫీసరుకు యిన్నివేలు లంచం ఇచ్చాడనీ—ఫలానా ఆఫీసరు పెళ్లానికి ఇంకో ప్రియుడు ఉన్నాడని!

ఇంత బాహాటంకాగానే ఊరంతా గుసగుసలు బయలుదేరాయి. ఆ ఫలానావారు మేష్టారుకోసం కబురు పంపించవలసి వచ్చింది. ఆయన తిరిగివచ్చి అల్లుడ్ని ప్రశ్నిస్తే "నేను వ్రాసింది అబద్ధం అని నిరూపించండి. మీరుకూడా సత్యానికి దూరమై పోతున్నారు. వీళ్ళందరి అవినీతిని ప్రజలముందు పెట్టి వీళ్ళకు మంచినీరు పుట్టకుండా చేస్తాను" అన్నాడు.

మేష్టారు చాలా చెప్పినా ప్రయోజనం లేకపోయింది. అల్లునితో వాదించటానికి యిష్టపడక ఊరుకున్నారు. ఆ వారం రోజుల్లో ఒకరోజు రాత్రి తన కార్యక్రమం కొనసాగిస్తుంటే కొందరు గుమిగూడి శుభ్రంగా వీపు చదునుచేశారు. ముడుకుమీద చెయ్యిమీద చిన్న దెబ్బతగిలి రక్తం కొద్దిగా కారుతోంది. ఇంటికి వచ్చాడు. తనకోపం పూర్తిగా మామమీద చూపించాడు. డాక్టరు సర్టిఫికేటు తీసుకొని పోలీసులకు ఫిర్యాదుచేస్తావా లేదా అని కూర్చున్నాడు. మేష్టారు మాటాడలేదు. మామకు తెలియకుండా

ఏమీ జరగదని — మళ్లీ యీ యింటిముఖం చూడనని వెళ్లిపోయాడు — చీకటిలో కలిసిపోయాడు.

మేష్టారు అలా నిల్చుండిపోయారు. సావిత్రి రెండడుగులు ముందుకువేసి తండ్రివైపు చూసి నిల్చుండిపోయింది. రెండురోజులు యెక్కడికీ కదలలేదు. మళ్లీ ఆయన యే నిర్ధారణకు వచ్చారో యేమో మామూలుగా బడికి వెళ్లేవారు.

కొన్నాళ్లు గడిచాయి. మేష్టారి వుత్తరం చూసుకొని ఒకనాటి మధ్యాహ్నానికి విశాఖపట్నంనుంచి రామారావు వచ్చాడు. తన బాధల్నీ సంతోషాన్నీ రామారావుకు చెప్పుకున్నారు మేష్టారు. సాయంత్రంవరకూ, అల్లుడు వెళ్ళిపోయేవరకు జరిగిన సంగతి వివరంగా చెప్పారు. సాయంత్రం యిద్దరు షికారుకు బయలుదేరారు. మూడు ఫర్లాంగులు దూరాన్న ఉన్న రైలురోడ్డు దగ్గరకు వెళ్లి ఆదగ్గరగా యెత్తుగా ఉన్న మర్రిచెట్టు మొదట్లో కూర్చున్నారు.

మేష్టారు ఒక కార్డు రామారావుచేతికి ఇచ్చారు. అది అల్లుడు వ్రాసిందే. అందులో యేంవుందంటే సావిత్రి నిజస్వరూపం తాను తెలుసుకున్నానని — దానికి మొగుడంటే యేమాత్రం అభిమానం వున్నా ఆరాత్రే తనవెంట పరుగెత్తేదని — యిలాంటి స్త్రీని తను ఇక సంస్కరించడానికి పూనుకుంటానని వ్రాసాడు. తరవాత తన శిష్యుల్లో ఇద్దరికి వ్రాసిన కార్డులు రెండు యిచ్చారు. "మేష్టారి ఇంట్లో స్టూడెంట్సు కరవా? అందులో సావిత్రికి మొగుడంటే అసహ్యం! ఏమైనా జరుగుతుంది!" రామారావుకు బ్రహ్మాండమంత కోపంవచ్చి యేదో యేదో అనేసాడు. మేష్టారికీ తనలా కోపం వచ్చిందనుకున్నాడు. గానీ రాలేదు.

"ఇప్పుడు నిన్నెందుకు పిలిపించానంటే"......అని ఆగిపోయారు మేష్టారు. మళ్ళీ అన్నారు "వాడిని తిట్టటానికి నే పిలువలేదు. నాతో నువ్వూ ఖడ్గపురం రావాలి."

కాస్సేపు ఆలోచించాక సరే అన్నాడు. లేచిపోతూ "వెళ్ళకపోదును కానీ వాడేదో అమ్మాయికి ఉత్తరం వ్రాసినట్లుంది. అప్పటి నుంచీ అక్కడికి తీసుకవెళ్లి విడిచిపెట్టమంటోంది. మనంవెళ్లి వాడి పరిస్థితి చూసాకా ఆలోచిద్దాం" అన్నారు.

ఇద్దరూ ఖడ్గపురం వెళ్లాక ఒకపూట తిరిగాక ఆనందరావు జాడ తెలిసింది. ఒక మారుమూలలోవున్న ఆకొంప — ఆకొంపలో వుంది ముప్పయ్యేళ్ల భామ — నోటిలో ఖిల్లీ — పెదాలకు లిప్‌స్టిక్ వ్రాసినట్లుంది. ఎర్రటి జాకెట్టు, వ్రేలాడే జాకోలు — చిన్న లెంగాళీముడి — మట్టిరంగు చీరకట్టి కొత్తా పాతా, ఉత్తరదక్షిణపు సంస్కారం కలిసిన మనిషిలా అగుపించింది. ఆమె గంభీరంగా మాటాడుతుంటే శక్తి వుత్పత్తి అవుతున్నట్లుంది. సుమ్మంలో చాప వేసి కూర్చోబెట్టింది. మేష్టారు మాటాడలేదు. రామారావు ఆమె అడిగిన ప్రశ్నలకు జబాబుచెప్పాడు.

"మీాఓడంటున్నారు. నాకొక్కర్తే ఉంటేది. అది చచ్చిపోయిందని సెప్పాడే! మరెవరూ వేరన్నాడు."

ఇద్దరూ అధాటికి మాటాడటానికి పిరికివాళ్లయ్యారు. ఆమె అంది "మీాఓరు యింకెవరో! ఈయన వస్తాడు మూడ్డురుగాని — సాల మంచిమనిషి — ఒకోసారి కోపం వస్తాది — ఆసెంలోనే సిన్న పిల్లడిలా అయిపోతాడు — ఏడ్చుకుంటాడు ఆడదానిలాగ — మల్లా మరోసెనానికి పెద్దపులే — ఆయనదగ్గర కోపం ఎంతుందో కనికారం అంతుంది — సెడ్డెంతుందో మంచంత వుంది — మా దొడ్డమనిషి!"

ఇంతలో పాకుపిల్లాడిచేత తెప్పించిన 'చా' నీరు యెదర పెట్టి బలవంతంచేసింది. మేష్టారు త్రాగలేదు. రామారావు త్రాగుతుంటే "ఆయనకి ఖర్చుకి డబ్బు ఇచ్చేస్తే యింకేం గొడవ వుండదు. గొడవసేసినా నాకేంటో నానోఅమ్మలా అయిపోతాను. అప్పుడు కొట్టినా నవ్వుతాను — తిట్టినా నవ్వుతాను. కొట్తాడు, తిట్తాడు, తరవాత ఆయనే ముద్దెస్తాడు. అప్పుడు అసలైన మొగుడువాగ వుంటాడు."

ఆమె ఇదంతా చెప్పడానికి యేమాత్రం మొగమాటపడలేదు. ఆమె యెంత బజారుమనిషైనా యేదో సావిత్రిలో లేనిది ఈమె దగ్గర వుందనిపించింది. అందుకే అనందరావు యీమెదగ్గర వుండగలిగి యీమెచే దొడ్డమనిషనిపించుకున్నాడని సైకాలజీ స్టూడెంటు రామారావు అనుకున్నాడు.

ఆనందరావు వచ్చాడు — తుపాను వచ్చినట్లయింది. మేష్టారుగానీ రామారావుగానీ యేమాటా అనటానికి అవకాశం యీయలేదు. నానా దుర్భాషలాడాడు. కూతురుని ఇంట్లో పెట్టుకొని వ్యాపారం చేస్తున్నావన్నాడు. న్యాయాన్ని నీతిని సమర్థించని బురకొరాయుడవన్నాడు. ఈ మనిషి తన కూతురుకంటే యెన్నోరెట్లు నయమని-యిది తన కూతుర్ని పోషిస్తుందని అన్నాడు. మేష్టారు దైన్యంగా "ముందుగతి ఆలోచించు నాయనా" అన్నాడు.

"నాకేమిటి ఒకరి అదుపాజ్ఞలో ఉండే అవసరం నాకేం వుంది?"

కోపం కక్కుతుంటే మేష్టారు సాంతంగా "అవును నాయనా! తెగిన గాలిపటంలా స్వేచ్ఛగా విహరిస్తానంటావు. కానీ ఆ తెగిన గాలిపటం ఎంతసేపు గగనమార్గాన వుంటుంది? మనిషైపుట్టాక యెవరో ఒకరి అదుపాజ్ఞల్లోనో అథవా తనయొక్క సభ్యత్వానికైనా కట్టుబడకపోతే — యెదురయ్యేది వినాశం!"

అనంవరావు విరగబడి నవ్వుతూ "ఇది బడికాదు పంతులూ! వచ్చినత్రోవనే పోతావా లేదా?" ముఖంమాసి మాటాడమన్నాడు రామారావు. ఇద్దరూ లేచేవరకూ వెంటతగుల్తూ మేష్టారు ముఖం మీాద తుప్పున ఉమ్మేశాడు. ఇద్దరు నడుస్తున్నారు. వాడు అంటున్న మాటలు ఇంకా వినిపిస్తున్నాయ్. వినబడకపోయినా చెవులో గింగురుమంటున్నాయ్. మేష్టారు ఒకమాటైనా ఆడలేదు. రైలు ఎక్కారు. మేష్టారు నిముషానికి ఒకవిధంగా అగుపిస్తున్నారు. అగ్నిపర్వతం తనలో ఉద్భవించిందని ఒక క్షణం — మరోక్షణం మహాసముద్రపు లోతుల్లోని నిశ్చలత్వం తనని యెటువంటి గాబరా పొందకుండా చేస్తోందని అనుకున్నాడు శిష్యుడు.

ఆయన మైళ్లతరబడి రైలువచ్చినా మాటాడలేదు. కొంతసేపు హాలాహాలాన్ని చిరునగవుతో మ్రింగిన గరళకంఠునిలా మరోక్షణానికి శ్మశానవాటిలో భీభత్సంగా నాట్యంచేస్తున్న పరమశివునిలా అగుపించారు.

తిరిగివచ్చేసరికి "నాయనా!" అన్నాడు. పెద్ద పిల్లాడ్ని. నడచి ఇంటికి వెళ్తున్నారు. మళ్లీ "నాయనా!" అన్నారు. "అమ్మాయిని అడిగితే యేం చెప్పను?"

చీకటిలో సమాధానం కోసం గిలగిలలాడుతుంటే మామ చేతిని గట్టిగా పట్టుకొని వలవల యేడ్చేశాడు.

"మేష్టారూ!" అన్నాడు యేదో రౌద్రం యేదో అభిమానం చెప్పలేని బాధ అన్నీ ఒక్కసారిగా ప్రజ్వరిల్లాయి.

శిష్యుడు మరింకేమీ మాటాడలేదు. చీకటిలో యిద్దరూ మెల్లగా నడచి ఒంటిగావున్న యిల్లు చేరుకున్నారు. మేష్టారు సావిత్రివైపు చూడలేదు. జవాబు వాళ్ల ముఖాల్లోనే గ్రహించిన సావిత్రి యే ప్రశ్నా వేయలేదు.

ఒకరోజు....రెండురోజులు......వారం....నెల....గడిచి పోతున్నాయ్. అల్లుని దగ్గరనుంచి వచ్చిన ఒక్క ఉత్తరం కూతురుకు చూపించలేదు. తనూ చదువలేదు. రెండో ఉత్తరం చింపనూ లేదు. మరి ఉత్తరాలూ లేవు. ఎవరైనా కూతురు గుణగణాలు పొగిడి అల్లుని దూషిస్తే "నాకు కూతురులేదు. నా కొడుకు సావిత్రి!"అనే వారు మేష్టారు. దుఃఖంతో మానంతో కృంగిపోయి కృశించిపోతున్న సావిత్రి ఒంటరిగా కూర్చొని తనలో తనే నవ్వుకుంటోంది. అప్పుడప్పుడూ తనలో తనే యేవేవో మాటాడుకుంటుంది. మేష్టారు కూతురు పరిస్థితిచూసి...రోజుకు రోజూ తనలో తనకు తెలియకుండానే ద్వేషం రగులుకుంటోంది......ఒకనాటి రాత్రి తనకు నిద్దరపట్టలేదు. కూతురు నడిరాత్రిమీద లోపలి వసారాలో చీకటిలోనే యిటూ అటూ పచారుచేస్తూ యేవో మాటలు అంటోంది. "దెయ్యాలు భూతాలు రాకుండా రక్షిస్తున్నాను యీయింటికి"— మేష్టారు కూతురు అంటున్న మాటలు వినగానే నడుం విరిగినట్లయింది. అయినా తమాయించుకొని లేచి "చాలా రాత్రయింది పడుకో అమ్మా" అన్నారు.

సావిత్రి తండ్రివైపు చూస్తూ, "నాన్నా! ఆయన యేమయ్యారో....ఉత్తరమైనా రాలేదు! నన్ను ఆయన దగ్గర విడిచి పెట్టరూ!" అలా నిల్చొనే యేడ్చేస్తోంది. కొద్దిక్షణాల్లో మళ్ళీ పకపక నవ్వుతూ "నేను మీ కొడుకునుకదూ? ఇక్కడే ఉంటాను. ఏ భూతాలనుంచీ మీకు ఆపదరాకుండా చూస్తుంటాను."

తెల్లవారేవరకూ యిద్దరికి నిద్దరలేదు. పగలల్లా కూతురు పని పాట్లు యేవో చేసుకపోతోంది. ఒక మూగమనిషిలా ప్రపంచంతో తనకేం సంబంధంలేనట్లుగా పోతోంది. ఇరుగుపొరుగంటూ ఎవరూ లేరు. ఒక చిన్న తోటలో వూరిచివర మేష్టారు ఇల్లువుంది. రైళ్ల కూత, పిట్టల అరుపులూ వినిపిస్తుంటాయ్.

సావిత్రి పరిస్థితి రానురాను అధ్వాన్నం అయిపోతోంది. మనోవ్యాధితోపాటు యేవో జబ్బు ఆవరించినట్లుంది, మేష్టారు కూతురుని చూసినప్పుడూ, తలచినప్పుడూ అల్లుడు యెదరగా ప్రత్యక్షమౌతున్నాడు. తను అల్లునిమీద రాతిబండ వేసినట్లు, తుపాకి పేల్చినట్లు ఇంకా రకరకాల క్షణికమైన ఆలోచనలు తిరిగినా యెంతోసేపటికిగాని మళ్ళీ తన మామూలు ధోరణికి రాలేకపోతున్నారు.

శంభ్రకరోజులు జారిపోతున్నాయ్. శ్రావణ మాసం అమావాస్యనాడు చేరవచ్చింది. ఒక సంవత్సరం దాటినా ఆనందరావు జాడే తెలియదు. తెలుసుకోవాలని మేష్టారు ప్రయత్నించలేదు...కానీ కోడోవిధంగా యింట్లోవున్న యిద్దరికీ అంటిపెట్టుకున్నట్లే వున్నాడు.

మేష్టారి పిల్లల డాక్టరు రాజమండ్రిలో వుంది. సావిత్రి పరిస్థితి బాగులేదని తెలిసి చూడటానికి వచ్చి యీ జబ్బు బాగుచేయిస్తానని సావిత్రిని తీసుకవెళ్ళింది. మేష్టారు కాదనలేదు. స్థలం మారిస్తే కూతురు మానసికంగా కొంత కోలుకుంటుందని అనుకున్నారు.

సావిత్రి రాజమండ్రి వెళ్లి నెలరోజులు పూర్తికాలేదు గాని మేష్టారు ఇక్కడ మానసికంగా బాధపడుతున్నారు. ప్రతిక్షణం కూతురుగురించి ఆలోచనలే! చెల్లెలు జాగ్రత్త తీసుకుంటుందనే విశ్వాసంవున్నా యిల్లంతా చీకటయినట్లుంది. ఒకసారి చూసైనా వద్దామనే కోర్కెతో బయలుదేరి వెళ్లాడు.

తిరిగివచ్చినప్పటికి రాత్రి పదిగంటలైంది. తలుపుతీసి హరికేన్‌లాంతరు వెలిగించారు. కాళ్ళూ చేతులూ కడుక్కొన్నాక పరుపు వేసుకున్నారు. కూతురుగురించి ఆలోచిస్తూనే పక్కవాల్చారు. కూతురు చిన్ననాటినుంచీ జరిగిన సంఘటనలన్నీ తరంగాలులా తలపుకు వస్తున్నాయ్. గుండె చివుక్కుమంది. ఈలోకంలో తనకేదైతే ప్రియాతిప్రియమైనదో దానిని ఒక హంతకునికి చేతులారా అప్పగించాననుకున్నాడు. పాముకు పాలుపోసి పెంచటం పులిని ఇంట్లో పెట్టుకోవటం ఎంత తెలివితక్కువ? తను అల్లుడ్ని ఇంట్లోపెట్టుకొని తెలివితక్కువవాడి నయ్యాననుకున్నాడు. వాడినుంచే తన కూతురి పరిస్థితి యీలా వచ్చింది. తన సర్వస్వాన్ని కొల్లగొట్టినవాడు......రాత్రి పదకొండు దాటిపోయింది.

ఈ ఆలోచనలో అల్లునిమీద యీర్ష్య లోలోన మండుచున్న అగ్ని పర్వతంలా ఆయిపోయింది. తలుపుతట్టిన చప్పుడు—మొదట వినిపించలేదు. రానురాను చప్పుడు వుండివుండి వినిపించింది. ఎవరూ అని లోనుంచే అరిచారు. జవాబులేదు. మళ్లీ తలుపు చప్పుడయింది. లేచి లాంతరు పట్టుకొని గుమ్మందగ్గరకు వెళ్లి "ఎవరూ"? అంటూనే తలుపుతీసారు.

"నువ్వా?" మేష్టారు ఒక్క అరుపు అరచారు.

అల్లుడు తలదించి నిలుచున్నాడు. అగ్ని పర్వతం బ్రద్దలైంది. గాలిపటం తెగిపోయింది. కోపం శరీరాన్నంటేసి పైకి ఎత్తివేసింది; గజగజ వణకించేసింది. తన స్వాధీనంలో లేని తన మనసు...అవయవాలు...చేతిలోని లాంతరును అల్లునిమీదకు విసిరేశాయ్.

ఆనందరావు అంతర్ధానమయ్యాడు. చీకటిలో మేష్టారు తలుపు ధాం మని వేస్తూ పరుపుమీదకు వెంగున గంతువేసి కూలబడిపోయారు. అంతే...తెల్లవారి లేచేసరికి వార్తవచ్చింది... అల్లుడు రైలుక్రింద తలపెట్టాడని...ఆహా అన్నారు—అంతే! ఎందుకు ఆత్మహత్య చేసుకున్నదీ యింకెవరికీ తెలియలేదు.

పదిగంటలప్పుడు తిరిగి వస్తుంటే తపాలా బంట్రోతు యెదురై "మూడురోజులైౖ వుత్తరం వచ్చింది. కిటికీలోనుంచి గది లోనికి వెయ్యటానికి ప్రయత్నించాను గానీ వీలయింది కాదు" అంటూ కవరు అందిచ్చాడు. ఇంటికి వచ్చాక చదువకూడదనుకుం టూనే చదివితే గుండె జెణికింది. పట్టు తప్పిన మనిషి అయి పోయారు.

మేష్టారిపరిస్థితి మిత్రునిద్వారా విన్న రామారావు బొబ్బిలి వచ్చాడు. పగలు పదిగంటలకు వచ్చినదగ్గరనుంచీ మేష్టారిదగ్గరనే కూర్చొనివున్నాడు. ఆయన యేమీ మాటాడలేదు. ఈ లోగా చాలామందివచ్చి వెళ్ళిపోతున్నారు. ఆయనవైఖరి చూస్తుంటే బహుశః కొద్దిగా మతిచెడిందేమో ననిపించింది. ఇంత నీరసంగా తన నెప్పుడూ చూడలేదు.

హోటలుకు వెళ్లి భోజనంచేసి వచ్చాడు మేష్టారిప్రక్కనే చాపవేసుకున్నాడు. రాత్రి తొమ్మిది దాటింది. చీకటిరాత్రి ఒకసారి రైలుకూత వినిపించింది. మేష్టారు గతుక్కుమన్నారు.

పదిగంట లైంది. సావిత్రి పెరటిగదిలో కూర్చొనివుండటం గుమ్మంద్వారా కనిపిస్తోంది. బెడ్ లైట్ వెలుగులో ఆమె ఒక్కొక్కసారి లేచి ఇటూఅటూ తిరుగుతోంది. కొంత సేపయ్యాక రామారావుకు ఆమె అడుచున్నమాటలు వినిపిస్తు న్నాయ్. "మీరు ఎంత మంచివారు...మీరంటే నాకు అంత భక్తి యెందుకుంటేది? మీ అంత మంచివారు లోకంలో వున్నారా? మీరు చచ్చిపోయారని వారంతా అంటున్నారు? నిజం గానే...లేదు లేదు...మీరు చావలేదు...మీరు బ్రతికే వున్నారు ...ముమ్మాటికీ..."

రాను రాను ఆమె గొంతుక పట్టుకపోయింది.కళ్లల్లో నీరు కారి పోతోంది..."పోనీ లెండి. ఒకసారి వచ్చి నాతో మాటాడరూ?... మాటాడరూ?"

సావిత్రి అలా అంటూనే మంచంమీద కూలిపోయింది. ఈ మాటలు వింటూ ఈ పరిస్థితి తిలకించిన రామారావు కళ్లల్లో నీళ్లు తిరిగాయ్. నిశ్శబ్దంలో ఆమె తీస్తున్న యెగవూపిరి యిక్కడికి విని పిస్తోంది. అప్రయత్నంగా "అయ్యో! పాపం!" అన్నాడు.

మేష్టారు "నాయనా!" అన్నారు. శిష్యుని ఒళ్లు ఒక్క సారిగా పులకరించింది. ఏం మాటలు వస్తాయో అని ఆతృతలో యెదురు చూశాడు.

"నాయనా! సావిత్రినిగూర్చి విచారిస్తున్నావా? వద్దు నాయనా-తండ్రీ, ఆ పని నేను చేశాను. అది ఆమె కర్మ! నేను అంచేత నే విచారించలేదు."

శిష్యుడు ఆశ్చర్యంగా యీ బాధ అంతా చేని కన్నట్లు చూశాడు.

వినువెంటనే మేష్టారు అన్నారు "నా గురించి విచారించు నాయనా...నా గురించి...విచారించు..."

ఇంతలో ఆయన కళ్లల్లోనుంచి నీరు గిరగిర తిరిగి, జలజలా వ్రాలటం మాని చపట్టున దగ్గరకు వొచ్చాడు. కళ్లు ఒత్తుకోకుండానే "ఇదిగో...యీ ఉత్తరం చదువు నే నెందు కిలా అయ్యానో అర్థం అవుతుంది!"

హరికేన్లాంతరు దగ్గరగా జరిగి రామారావు వుత్తరం లోపలలో చదువుకోవటం మొదలుపెట్టాడు!

"మహారాజశ్రీ మామగారికి నమస్కారములు.

ఈ వుత్తరం చదవకుండా చింపాలన్నంతకోపం మీకు వస్తుంది. కానీ ఒక్కసారైనా చదవమని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. నేను చేసిన పనులకు మీలాంటి వుత్తములు, మీ కూతురులాంటి పతి వ్రత యెన్ని బాధలు పడ్డారో తెలుసుకున్నది యీ మధ్యనే! నేను యెందుకిలా అయ్యానో నాకే అర్థం కాకుండా ఉంది. నేను బహుశః కల్లుత్రాగినవాడిలా అయ్యుంటాను, నాలోని చెడు గునే సింహాసనం ఎక్కించాను. నాగురించి మీకు చాలా తెలుసు నని మీరనుకోవచ్చు. కానీ మీకు నాగురించి అధికం తెలియదని మీయిల్లు చేరే ముందు, మీ యిల్లు విడిచిపెట్టాక విషయాలు పూర్తిగా తెలియవని అవే వ్రాసుకుంటున్నాను. నేను కొన్నాళ్లు మనిషిని యెందుకు కాలేదో నా కిప్పుడు అర్థమైంది.

మా నాన్న గడించిపోయారు. మా అమ్మ ముద్దుచేత సరియైన అదుపాజ్ఞలలో ఉంచలేదు. చిన్నతనంనుంచీ నాదే పెద్దరికం; నాకు కూడిన చెడ్డసహవాసందే పెద్దరికం అంటే సబబుగా ఉంటుంది. నేను మా అమ్మచావుకి కారణం అయ్యానేమో అని పిస్తుంది. నేనిలా బ్రతుకుతానని బాధతో యెల్లప్పుడూ ఉండేది. ఆమె పోయేసరికి మిగిలింది నేను—యెందుకూ కొరగాని నా ఉద్యోగం! నాకు కష్టాలనేవి యెలా ఉంటాయో మీయిల్లు విడిచి పెట్టాక గానీ తెలియలేదు.

మీయిల్లు విడిచిపెట్టాక కొన్నాళ్లు యెలాంటి తిరుగుళ్లు తిరి గానో మీకు తెలుసు. ఖర్గపురంలో డబ్బుకోసం నన్ను దేవునిలా చూచిన ఆమెనుకూడా మోసగించాను. జీవితంలో ఆమె ఒక్కసారి ఆవేశ క్తిడై నన్ను త్రొక్కివేసి ప్రాణాలతో వూరు విడిచిపెట్ట నిచ్చింది. కడుపుకోసం నెలలకొద్ది బాధపడ్డాను. ఆకలంటే యేమిటో నాకు తెలిసింది. రిక్షాలు లాగాను. బస్తాలు, బుట్టలూ మోశాను. రోడ్లు తుడిచాను. చింకిబట్టలతో చలికీ యెండకీ లోనై నాలానే బాధపడే యెందరిమధ్యనో తిరిగాను. ఈ బాధలు పడి, యెదుటివాళ్ళ బాధలు కళ్ళారా చూడటంవల్ల నా కరుడుగట్టిన హృదయం ... సూర్యరస్మి తగిలిన మంచులా అయిపోయింది. రాహువు విడిచిన సూర్యునిలా...నాలో అసలైన వెలుగు ప్రకాశిం చింది...ఈ హృదయంతో నేను జరిగినరోజులు తలంచాను; చూచాను. నేను యెంత చెడ్డవాడినో తెలుసుకున్నాను.

మళ్లీ ఇన్నాళ్ళకి నాలో మీమీదనున్న గౌరవం, విశ్వాసం భక్తి మీదగ్గరకు రానిస్తోంది. నావిచయమై సావిత్రిపలవరిస్తూ పిచ్చి మనిషి అయ్యుంటుందని నాకు తోస్తోంది.ఆమె పరిస్థితి చూసి మీరు బేజారెత్తి నేనంటే పరమశత్రుత్వం వహించివుంటారు. కానీ నాలోని విశ్వాసం నన్ను మీరు ఉదారులని, నాపాతజీవితాన్ని మరచి గౌరవించి ఆదరిస్తారని మళ్ళీ మీ దగ్గరకు చేరనిస్తోంది. ఇటు

వంటి ఆశను నిరాశచేస్తే నాకీలోకంలో నిలవటానికి చోటు లేదు—నేను భగ్నహృదయుణ్ణై యేమూతానో చెప్పలేను.

మీ అల్లుడు
ఆనందరావు"

పరిస్థితి గ్రహించిన రామారావు ఒక నిట్టూర్పు విడిచాడు. మేష్టారిదగ్గరగా వస్తుంటే ముళ్ళీ దీనస్వరంతో "నాయనా! ఊరంతా నేనేదో అయిపోయానని నాకు నీతులు చెప్తున్నారు. నేనేమీ కాలేదు—చలయ్యానే. కానీ ఇదివరకు చలనయ్యాలా సంఘంలో ఒక గౌరవమైనస్థానాన్ని అలంకరించడానికి తగిన వాడిని కాను"....

మేష్టారి దుఃఖం పొంగిపోవటంవల్ల మాటాడలేకపోయారు. కొంతసేపయ్యాక కానేలవేపు దృష్టి అనుస్తూ "నా యేడుపు నా గురించే..."

పరుపుమీద చేరబడ్డారు. ఉండి ఉండి ఆయన ముఖం ముదుచుకపోతోంది. అంతటిలో ఆయన వెక్కుతూ కన్నీరు కారుస్తుంటే రామారావు ఆయనను తాకి ఓదార్చబోయాడు.

ఆయన కళ్లు తుడుచుకుంటూ "నాయనా! లోకంలో యెందరో యెన్నో చెడ్డపనులు చేస్తారు. నా అల్లుడూ చేశాడు. వాడి పనులవల్ల మేం మానసికంగా బాధపడ్డాం. అంతే—కానీ ఇన్ని చెడ్డపనులుచేసి ఎవరిని ఖూనీ చెయ్యలేదు. కానీ నేనో—లోకమంతా నన్ను మంచివాడనని గౌరవిస్తుంది—కానీ ఒక్క నిముషంలో వచ్చిన కోపంతో బ్రతుకుమీద గంపెడాశతో వచ్చిన ఒక మంచివాని ప్రాణాన్ని తీశాను......నేను ఖూనీకోర్ని—నాకీసంఘంలో స్థానంలేదు..."

నిశ్శబ్దం చీకటితోపాటు ఆవరించింది. ఎంతసేపటికో చః మయ్యా మేష్టారి మాటలు వినిపించాయ్. "తెగిన గాలిపటం ఆకాశాన యెంతసేపు వుంటుంది?"

ఈ మాటలు ఆయన పలవరిస్తున్నారో లేక తెలివితో అంటున్నారో తెలుసుకోలేని రామారావు కిటికీగుండా చీకటిలోనికి చూసాడు. రైలుకూత వినిపించింది భీకరంగా!

ఉత్తమమైన లూబ్రికేషనుకు చిహ్నము
"వీడాల్"
ప్రపంచంలో మిక్కిలి సుప్రసిద్ధమైన మోటారు ఆయిలు
టైడ్ వాటర్ ఆయిల్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్.
ఏజంట్లు:
ప్యారీ అండ్ కంపెనీ, లిమిటెడ్,
(ఇంజనీరింగు డిపార్టుమెంటు) మద్రాసు-1.